ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

బుధవారం 6 మార్చి 2024 | 3



స్వర్ణయుగమే

- టీడీపీ, జనసేన ఉమ్మడి బీసీ డిక్లరేషన్‌తో బీసీలకు మళ్లీ మంచిరోజులు
- వైసీపీ పాలనలో నలిగిపోయి చితికిపోయిన బీసీల్లో ఆనందోత్సాహాలు
- ఆదరణ పథకాన్ని తిరిగి ప్రారంభిస్తామన్న ప్రకటనతో భరోసా
- పెన్షన్ రూ.4వేలకు పెంపు, ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామనడంతో కొత్త ఉత్సాహం
- బీసీ భవనాలు, కమ్యూనిటీ హాళ్లను ఏడాదిలో పూర్తి చేస్తామనడంతో పునరుజ్జీవం
- 1986 తర్వాత నుంచీ జరగని బీసీల కులగణనను చట్టబద్ధంగా చేస్తామని హామీ



మాట్లాడితే నా బీసీ.. నా బీసీ... అంటూ ఇన్నాళ్లూ వారిని నిలువునా మోసం చేసిన జగన్ సర్కారుకు టీడీపీ-జనసేన కూటమి గట్టి షాక్ ఇచ్చింది. ఉమ్మడి డిక్లరేషన్ ప్రకటనతో వైసీపీ పాలనలో నలిగిపోయిన బీసీలకు సాంత్వన చేకూర్చేలా కీలక నిర్ణయాలు ప్రకటించింది. బీసీలను కేవలం ఓట్ల కోసమే వాడుకుని వారిని ఐదేళ్లుగా అణగదొక్కిన జగన్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేలా డిక్లరేషన్ ఆయుధాన్ని వదిలింది. అధికారం చేతిలో ఉన్నా ఏదీ చేయకుండా బీసీలను మోసం చేసిన తీరును ఎండగట్టింది. తిరిగి అధికారంలోకి వచ్చాక పూర్వవైభవం తీసుకువస్తామని ఎలుగెత్తి చాటింది.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

వైసీపీ అటకెక్కించి కక్షతో రద్దుచేసిన అనేక కీలక సంక్షేమ పథకాలను తిరిగి అమలు చేస్తామని చెప్పి జిల్లాలోని బీసీల్లో టీడీపీ-జనసేన కూటమి ధైర్యం నింపింది. మళ్లీ స్వర్ణయుగాన్ని తెస్తామని చాటింది. ఆదరణ, బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం, కులగుణన, స్థానిక సంస్థలు, నామినేటెడ్ పోస్టుల్లో రిజర్వేషన్లు, బీసీ భవనాల నిర్మాణం... ఇలా అనేక కీలక అంశాలపై తన అజెండా ప్రకటించింది.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 1986 లెక్కల ప్రకారం 15.65 లక్షల మంది బీసీలున్నారు. ఆ తర్వాత నుంచి ఇప్పటివరకు బీసీలకు సంబంధించి కులగణన జరగ లేదు. దీంతో సంక్షేమ పథకాలు, ఇతర రిజర్వేషన్లలో వీరంతా అన్యాయానికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో బీసీలకు వెన్నుముకగా పేరొందిన టీడీపీ తాజాగా బీసీ డిక్లరేషన్ ప్రకటించడంతో జిల్లాలో బీసీలకు తిరిగి ఊపిరందినట్లయింది. ప్రస్తుత లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లాలో 19లక్షల 80వేల మంది బీసీలు ఉంటారని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ, జనసేన ప్రభుత్వం రాగానే చట్టబద్ధంగా కులగణన చేపడతామని ప్రకటించడంతో ఇన్నేళ్ల సమస్యకు పరిష్కారం దొరుకుతుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.5వేల కోట్లతో ఆదరణ పథకాన్ని ప్రారంభిస్తామని ప్రకటించడంతో బీసీల్లో తిరిగి ధైర్యం వచ్చినట్లయింది. గత టీడీపీ ప్రభుత్వం ఆదరణ-1, ఆదరణ-2 పథకం పేరుతో జిల్లాలో బీసీల్లో ఆయా కులాలవారీగా పలు వృత్తులకు సంబంధించిన కోట్ల విలువైన లక్షలాది పనిముట్లను అందించింది. రజకుల దగ్గరనుంచి కల్లుగీత కార్మికులు, నాయిబ్రాహ్మణులు ఇలా అనేకమందికి పనిముట్లను అందించి అండగా నిలబడింది. తీరా వైసీపీ అధికారంలోకి రాగానే ఆదరణ పథకాన్ని పూర్తిగా రద్దు చేసేసింది. అప్పటికే ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వేలాదిమంది దరఖాస్తులను పక్కన పారేసింది. వీరంతా కట్టిన డబ్బులకు సంబంధించి జిల్లాకు చేరిన వేలాది కిట్లను మూలనపడేసింది. దీంతో బీసీలంతా తీవ్రంగా ఇబ్బంది పడ్డారు.

డిక్లరేషన్‌లో పేర్కొన్న విధంగా బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టంతో బీసీల్లో ఆనందం ఉప్పొంగుతోంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో జిల్లాలో అనేక రకాల దాడులు జరిగాయి. కల్లుగీత కార్మికుల దగ్గర నుంచి నాయీబ్రాహ్మణులు, రజకులపై అధికారులు, వైసీపీ నేతలు జరిపిన దాడులకు లెక్కలేదు. ఈ నేపథ్యంలో ప్రత్యేక రక్షణ చట్టంతో బీసీలకు ఊరట లభించినట్లయింది. వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన పారిశ్రామిక ప్రోత్సాహకాలు తిరిగి అమలు చేస్తామని డిక్లరేషన్‌లో పేర్కొనడంతో బీసీల్లో ఆనందం వ్యక్తమవుతోంది. తిరిగి తమకు పూర్వవైభవం వస్తుందనే ధీమాను వారంతా వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి గత టీడీపీ ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో బీసీలకోసం బీసీ కార్పొరేషన్ ద్వారా ఓబీ ఎంఎంఎస్ పథకాన్ని అమలు చేసింది. ఏదైనా వ్యాపారం చేసుకోవాలనుకుని ముందుకు వచ్చిన లబ్ధిదారులకు రూ.లక్ష సబ్సిడీ, మరో రూ.లక్ష లోన్ అందించి ఆర్థికంగా ఎదగడానికి తోడ్పడింది. ఎంబీసీ పథకం ద్వారా రూ.30వేలు అందించి వ్యాపారులు ప్రోత్స హించింది. జగన్ ప్రభుత్వం వచ్చాక ఇవన్నీ రద్దు చేసి పారేసింది. దీంతో ఆర్థికంగా నిలదొక్కుకుని స్వయం ఉపాధిపై నిలబడాలనుకున్న బీసీలంతా రోడ్డున పడ్డారు. బీసీ భవనాలు, కమ్యూనిటీ హాళ్లను ఏడాదిలోగా నిర్మిస్తామన్న డిక్లరేషన్ ప్రకటనతో వారి ఆనందానికి అవధుల్లేవు.

కనిపించినవన్నీ కబ్జా చేసిన వైసీపీ

గత టీడీపీ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాలో బీసీలకు ప్రతి నియోజకవర్గంలో బీసీ భవనాలు, కమ్యునిటీ హాళ్లు మంజూరయ్యాయి. వీటి నిర్మాణానికి స్థలాలు, నిధులు కూడా విడుదలయ్యాయి. దోబీ ఘాట్‌ల నిర్మాణానికి కూడా రూ.లక్షల్లో నిధులు మంజూరయ్యాయి. కానీ వైసీపీ అధికారంలోకి రాగానే వీటి నిర్మాణాన్ని ఎక్కడికక్కడ నిలిపివేసింది. స్థలాలు మంజూరైన చోట వాటిని స్థానిక వైసీపీ నేతలు కబ్జా చేసేశారు. బీసీల్లో ఆయా సామాజికవర్గాల వారీగా కార్పొరేషన్లు, నిధులు, బీసీలకు నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్లు ఇస్తామని డిక్లరేషన్‌లో పొందుపరచడంతో వైసీపీ పాలనతో తాము ఎలా నలిగిపోయామో గుర్తుచేసుకుని బీసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో పేరుకు బీసీలకు కొన్ని కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా చిల్లిగవ్వ కూడా నిధులు కేటాయించలేదు. దీంతో అవన్నీ అలంకారప్రాయంగా మారాయి. ఇప్పుడు డిక్లరేషన్ ద్వారా రిజర్వేషన్ అమలు చేస్తామని టీడీపీ చెప్పడంతో ఎందరో బీసీలకు పదవులు లభించనున్నాయి. బీసీల్లో ఉన్న అనేక ఉపకులాల్లో తక్కువ జనాబా ఉన్నవారికి, ఎన్నికల్లో పోటీ చేయలేని వర్గాలకు కోఆప్షన్ సభ్యులుగా అవకాశం ఇస్తామని చెప్పడంతో వారందరికీ తొలిసారిగా గుర్తింపు లభించే అవకాశం ఏర్పడింది. టీడీపీ పాలనలో జిల్లాలో బీసీలకు ముప్పైకి పైగా పథకాలు అమల్లో ఉండేవి. కానీ బీసీలను కేవలం ఓటర్లుగానే చూసిన వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇవన్నీ రద్దు చేసేసింది. కేవలం జగనన్న చేయూత పథకం ఒక్కటే మహిళలకు అందుబాటులోకి తెచ్చింది. ఇందులోనూ రకరకాల కోతలు కోసి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఏడాదికి 36,177మందికి మాత్రమే రూ.పది వేలు ఇచ్చి మమ అనిపిస్తోంది.

బీసీ డిక్లరేషన్‌పై ఎవరేమన్నారంటే...

ఈ నిర్ణయం చారిత్రాత్మకం

అర్థాని శ్రీనివాసరావు, అగ్నికుల క్షత్రియ నాయకుడు, ముమ్మిడివరం



ముమ్మిడివరం: బీసీ డిక్లరేషన్ చారిత్రాత్మకం. పాడి రైతులకు ఆవులు, మేకలు, గొర్రెలు సబ్సిడీపై ఇవ్వడం, పేదరికంలో ఉన్న బీసీలకు వంద యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తామనడం సంతోషకరం. వృత్తి నైపుణ్య కేంద్రాల ఏర్పాటు, పరిశ్రమల స్థాపనకు సబ్సిడీ రుణాలు. శైవక్షేత్రాల పాలక మండళ్లలో బీసీలను నియమించడం, ఆక్రమణల్లో ఉన్న చెరువులకు రక్షణ కల్పించడం, కుండలు తయారుచేసే వారికి ప్రత్యేక స్థలాలు కేటాయించడం బాగున్నాయి. బీసీ డిక్లరేషన్ ప్రవేశపెట్టిన చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌లకు అభినందనలు.

ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావడం అభినందనీయం

గుబ్బల అప్పారావు, విశ్రాంత ఉపాధ్యాయుడు, నగరం



మామిడికుదురు: బీసీలపై దాడులు, దౌర్జన్యాలు జరగకుండా ప్రత్యేక రక్షణ చట్టం తీసుకొస్తామనడం అభినందనీయం. 50 సంవత్సరాలు దాటిన వారికి పెన్షన్ అమలు చేయడం గర్వించదగ్గ విషయం. అదేవిధంగా స్టడీ సర్కిల్, విద్యోన్నతి ప్రారంభించడం, బీసీ భవనాలు, కమ్యూనిటీ హాలు నిర్మాణాలు పూర్తి చేస్తామనడం బీసీలకే గర్వకారణం.

స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ హర్షణీయం

కాసా విజయసాగర్, బీసీ నాయకుడు, రావులపాలెం



రావులపాలెం: స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల పునరుద్ధరణకు ప్రతిపాదించడం హర్షణీయం. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ బీసీల అణచివేతే ప్రధాన అజెండాగా పని చేసిన జగన్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీసీలపై కపట ప్రేమ చూపుతున్నారు.

బీసీల అభ్యున్నతికి దోహదం

యరగతపు బాబ్జీ, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు



మండపేట: బీసీ డిక్లరేషన్ బీసీల అభ్యున్నతికి ఎంతగానో దోహదపడుతుంది. 50ఏళ్లకే రూ.4వేలు పింఛను, ప్రత్యేక రక్షణ చట్టం అమలు, సబ్ ప్లాన్, స్థానిక సంస్థల ఎన్నికల్లో 34శాతం రిజర్వేషన్, నామినేటెడ్ పదవుల్లో 34శాతం రిజర్వేషన్, జనాబా ప్రాతిపదికన కార్పొరేషన్ల ఏర్పాటు నిర్ణయాలు బాగున్నాయి.

అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారు

చింతపల్లి రామకృష్ణ, టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు, మండపేట



మండపేట: ఈ డిక్లరేషన్ ద్వారా బీసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారు. చంద్రన్న పెళ్లికానుక, ఆదరణ పథకాల పునరుద్ధరణ, చట్టబద్ధంగా కులగణన, స్వయం ఉపాధికి పది వేల కోట్ల కేటాయింపు, జగన్ రద్దు చేసిన 30 బీసీ పథకాలను పునరుద్ధరించడం, రాజకీయ, విద్యాపరంగా అమలు చేస్తామన్న పథకాలు ఎంతో మేలు చేస్తాయి.



పార్వేట మహోత్సవంలో పాల్గొన్న గోవింద మాలధారులు

వాడపల్లిలో పార్వేట మహోత్సవం

ఆత్రేయపురం, మార్చి 5: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గోవిందమాల దీక్ష ధరించిన స్వాములు గురుస్వామి సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిపారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సూర్యనమస్కారాలు, సత్యనారాయణ స్వామి వ్రతం, తిరుప్పావడ సేవ, పార్వేట మహోత్సవంలను కనుల పండువగా నిర్వహించారు. కదలీ వనంలో ప్రకృతి అందాల నడుమ శ్రీవారిని ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాస్టర్ ట్రైనీలకు శిక్షణ ఇస్తున్న డీఆర్వో వెంకటేశ్వర్లు

ప్రజాస్వామ్య సంరక్షకులుగా ఎన్నికల విధుల్లో పాల్గొనాలి

అమలాపురం టౌన్, మార్చి 5: సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వహించడం పౌర విధి మాత్రమే కాదని ప్రజాస్వామ్య సంరక్షకులుగా ఉండేందుకు ఇదో చక్కని అవకాశమనిజిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనీలకు సూచించారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో జిల్లా స్థాయిలో 57 మంది మాస్టర్ ట్రైనీలకు పోలింగ్ విధానంపై అవగాహన పెంపొందించి పోలింగ్ సరళిని ప్రయోగాత్మకంగా వివరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు బలాన్ని చేకూర్చేవిధంగా ప్రిసైడింగ్ అధికారి పనిచేయాలన్నారు. ఎన్నికల సంఘం సూచించిన విధులను తు.చ. తప్పకుండా పాటించాలన్నారు. ఏకకాలంలో పోలింగ్ నిర్వహణ కోసం బృందంలో ప్రిసైడింగ్ అధికారి, ఐదుగురు పోలింగ్ అధికారులు ఉంటారన్నానరు. సిబ్బంది సందేహాలను నివృత్తి చేశారు. డీఆర్డీవో పథక సంచాలకుడు డాక్టర్ వి.శివశంకరప్రసాద్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఎటువంటి లోటుపాట్లు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధం కావాలన్నారు.

'బహిరంగ మార్కెట్‌లో ఆయిల్ ధరలు తగ్గాయి'

అమలాపురం టౌన్, మార్చి 5: బహిరంగ మార్కెట్‌లో గత సంవత్సర ధరలతో పోలిస్తే పామాయిల్, సన్‌ఫ్లవర్, గ్రౌండ్ నట్ ఆయిల్ ధరలతో పాటు ఉల్లిపాయల ధరలు తగ్గాయనిజాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్ పేర్కొన్నారు. జిల్లా ధరల నియంత్రణ కమిటీ సమావేశాన్ని కలెక్టరేట్‌లో జేసీ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. జిల్లాలో నిత్యావసర వస్తువుల ధరలు, మార్కెట్‌లో వస్తువుల లభ్యతపై తొలుత సమీక్షించారు. పప్పు దినుసుల ధరలు కొద్దిగా పెరిగినప్పటికీ ఎండుమిర్చి, చింతపండు, బంగాళాదుంపల ధరలు స్థిరంగా ఉన్నాయన్నారు. వినియోగదారులకు భారం కాకుండా ఉండేలా వ్యాపారులు లాభాల శాతాన్ని కొంత తగ్గించుకుని నిత్యావసర వస్తువులు అమ్మాలని చాంబర్ ఆఫ్ కామర్స్, హోల్‌సేల్ వర్తకులను కోరగా అందుకు వారు అంగీకరించారు. బ్లాక్ మార్కెటింగ్‌కు అవకాశం లేకుండా చూడాలన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైసీపీలో టిక్కెట్ల 'పంచాయితీ'!

- అమలాపురం ఎంపీ అభ్యర్థిని తానేనంటూ రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ప్రకటన
- అధిష్ఠానం ఇంకా ఖరారు చేయలేదు: ఎంపీ మిధున్‌రెడ్డి
- రాపాక ప్రకటనతో రాజోలు అసెంబ్లీ వైసీపీ అభ్యర్థిగా గొల్లపల్లి సూర్యారావుకి లైన్ క్లియర్?
- ఎంపీ అనురాధ సమక్షంలోనే ఎమ్మెల్యే రాపాక ప్రకటనపై ఆమె వర్గీయుల ఆగ్రహం
- చిట్టబ్బాయి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఎంపీ అనురాధకు మైకు ఇవ్వని మంత్రి విశ్వరూప్
- వైసీపీలో బహిర్గతమవుతున్న అంతర్గత విభేధాలు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

వైసీపీలో 'టిక్కెట్ల పంచాయితీ' ప్రారంభమైంది. పార్టీ అధిష్ఠానం నిర్ణయంతో సంబంధం లేకుండా ఆశావహులు అడుగులు ముందుకు వేస్తూ బహిరంగ సభల్లో స్వీయ ప్రకటనలు చేస్తున్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అమలాపురం లోక్‌సభ స్థానం నుంచి వైసీపీ తరపున తాను పోటీ చేస్తున్నట్టు రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ చేసిన ప్రకటన ఆ పార్టీలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ప్రస్తుత ఎంపీతో పాటు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల వైసీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ ఎంపీ మిధున్‌రెడ్డి సమక్షంలోనే రాపాక చేసిన వ్యాఖ్యతో అక్కడే వున్న వైసీపీ పెద్దలంతా అవాక్కయ్యారు. పరోక్షంగావారం క్రితం టీడీపీకి రాజీనామా చేసి వైసీపీలో చేరిన మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావుకు లైన్ క్లియర్ అయ్యింది. రాజోలు అసెంబ్లీ వైసీపీ అభ్యర్థిగా గొల్లపల్లి పోటీ చేస్తారన్న ప్రచారానికి రాపాక చేసిన ప్రకటన బలం చేకూర్చింది. అయితే పార్టీ పరిశీలకునిగా వచ్చిన ఎంపీ మిదున్‌రెడ్డి అమలాపురం ఎంపీ అభ్యర్థిని ఇంకా ఖరారు చేయలేదని ప్రకటించడం ద్వారా రాపాక ఆశలపై బహిరంగంగానే నీళ్లు చల్లారు.

మరోవైపు పార్టీలో అంతర్గత విభేదాలు రచ్చకెక్కుతున్నాయి. పి.గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్తగా జిల్లా పరిషత్ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాల్‌ను అధిష్ఠానం నియమించింది. మంగళవారం చాకలిపాలెంలోని ఓ ఫంక్షన్ హాలులో మంగళవారం వైసీపీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. దానికి సిటింగ్ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు గైర్హాజరయ్యారు. మిధున్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకాగా మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ, రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్, పలు ప్రాంతాలకు చెందిన ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు హాజరయ్యారు. గొల్లపల్లి సమక్షంలోనే రాపాక కీలక వ్యాఖ్యలు చేశారు. తనను వైసీపీ అధిష్ఠానం అమలాపురం ఎంపీగా పోటీ చేయమని ఆదేశించిందని, పి.గన్నవరం నియోజకవర్గ కేడర్ అంతా తన విజయానికి సహకరించాలని రాపాక విజ్ఞప్తి చేశారు. దీంతో ఆ సమయంలో వేదికపై వున్న అమలాపురం ప్రస్తుత ఎంపీ చింతా అనురాధ చిన్నబుచ్చుకున్నారు. మిధున్‌రెడ్డి కానీ, విశ్వరూప్ కానీ రాపాకను వారించే ప్రయత్నం చేయకపోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. రాపాక ప్రకటనతో గొల్లపల్లి అభిమానులు సంబరాలు చేసుకున్నారు. అయితే రాపాక ప్రకటన అధిష్ఠానం అంగీకారంతో జరిగిందా లేదా అనే చర్చ నడుస్తోంది. మంగళవారం సాయంత్రం అమలాపురంలో శెట్టిబలిజ నేత, మాజీ ఎమ్మెల్యే కుడుపూడి చిట్టబ్బాయి విగ్రహావిష్కరణలో పాల్గొన్న మిదున్‌రెడ్డిచేసిన కీలక వ్యాఖ్యలు వైసీపీలో టిక్కెట్ల వివాదం రాజేసింది. అమలాపురం ఎంపీ టిక్కెట్ ఇంకా ఎవరికీ డిసైడ్ చేయలేదు... త్వరలోనే అధిష్ఠానం ప్రకటిస్తుందని మిధున్‌రెడ్డి స్పష్టం చేశారు. పి.గన్నవరం సభలో రాపాక వ్యాఖ్యలను ఆయన వ్యక్తిగతంగా కొట్టి పారేశారు.

ఎంపీ అనురాధకు అడుగడుగునా అవమానాలే..

చాకలిపాలెం సమావేశంలో ఎంపీ సమక్షంలోనే ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు తానే వైసీపీ ఎంపీ అభ్యర్థినంటూ చేసిన ప్రకటన ఎంపీ అనురాధను మానసికంగా కుంగదీసింది. ఉభయ గోదావరి జిల్లాల్లో పార్టీ వ్యవహారాలను చక్కదిద్దే మిధున్‌రెడ్డి సమక్షంలోనే ఈ పరిణామాలు చోటుచేసుకున్నప్పటికీ ఆయన మిన్నకుండిపోవడం కేడర్‌లో చర్చనీయాంశమవ్వడంతో పాటు అనురాధకు అవమానం జరిగిందంటూ ఆమె అనుచరులు ఆవేదన చెందారు. దానిని మరువకముందే అమలాపురంలో చిట్టబ్బాయి విగ్రహావిష్కరణ వేళ అందరి సమక్షంలోనూ మరోసారి ఆమెను అవమానించేలా మంత్రి విశ్వరూప్ వ్యవహరించిన తీరు చర్చకు దారితీసింది. సభాధ్యక్ష స్థానంలో ఉన్న మంత్రి విశ్వరూప్ అనురాధకు ఒక్క నిమిషం కూడా ఇవ్వలేదని ఆమె వర్గీయులు ఆరోపిస్తున్నారు. చిట్టబ్బాయి విగ్రహ ఏర్పాటుకు ఎంపీ అనురాధ తన వంతు సహకారం అందించింది. ఆమెతో కనీసం మాట్లాడించకుండా నిన్న కాక మొన్న పార్టీలో చేరిన మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావుతో పాటు చిన్నా, చితకా నాయకులకు కూడా అవకాశం కల్పించి ఎంపీని అవమానపరిచారని ఆరోపిస్తున్నారు. అయితే ఈ పరిణామాలను మిదున్ రెడ్డి కూడా సీరియస్‌గా తీసుకోకపోవడాన్ని ఆ పార్టీలోని ద్వితీయ శ్రేణి నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ వివాదం మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ మధ్య ఉన్న అగాధానికి మరింత ఆజ్యం పోస్తోంది.



అమలాపురంలో మాజీ ఎమ్మెల్యే కుడుపూడి చిట్టబ్బాయి విగ్రహావిష్కరణలో పాల్గొన్న మిధున్‌రెడ్డి, విశ్వరూప్, ఎంపీ అనురాధ



ఫ్లయింగ్ డ్రోన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

పెట్టుబడి వ్యయాన్ని తగ్గించి... వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలి

అమలాపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికతతో ఎరువులు, పురుగు మందులను పిచికారీ చేసేందుకు ఫ్లయింగ్ డ్రోన్లు అందుబాటులోకి వచ్చాయని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. ఫ్లయింగ్ డ్రోన్లు వినియోగించడం వల్ల పెట్టుబడి వ్యయాన్ని తగ్గించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో మంగళవారం అల్లవరం మండలం దేవగుప్తం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సమకూర్చిన 21 ఫ్లయింగ్ డ్రోన్లను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. రూ.2 కోట్లతో 21 డ్రోన్లు కొనుగోలు చేశారని, ఒక్కో డ్రోన్ ఆరు నుంచి ఎనిమిది నిమిషాలలోపు ఎకరం భూమిలో స్ప్రేయింగ్ ప్రక్రియ పూర్తి చేస్తుందన్నారు. వీటిని అద్దె ప్రాతిపదికన రైతులకు అందుబాటులోకి తీసుకు వస్తారన్నారు. రాష్ట్ర అగ్రిమిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు, జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు, జిల్లా సహకార అధికారి రాధాకృష్ణారావు,కె.త్రినాథరెడ్డి, జిన్నూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కవాతు చేస్తున్న కేంద్ర పోలీసు బలగాలు

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి: ఎస్పీ శ్రీధర్

రావులపాలెం, మార్చి 5: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి సారించినట్టు ఎస్పీ ఎస్.శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం రావులపాలెంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు కేంద్ర బలగాలు చేరుకున్నాయన్నారు. ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేలా పోలీసు దళాలు, జిల్లా పోలీసులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తామన్నారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లో విధులను అప్రమత్తంగా నిర్వహించాలని సూచించారు. ఎస్పీ ఆధ్వర్యంలో డీఎస్పీ, సీఐలు కేంద్ర బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు.

'జగనన్న పాలవెల్లువ'కు దరఖాస్తు చేసుకోండి

అమలాపురం టౌన్, మార్చి 5: బీటెక్ ఫుడ్ టెక్నాలజీ, బీటెక్ డెయిరీసైన్స్ పూర్తిచేసిన అభ్యర్థులు జగనన్న పాలవెల్లువ కార్యక్రమ నిర్వహణకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్‌హిమాన్షు శుక్లా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు సంబంధిత ధ్రువ పత్రాలతో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. ఎంపిక చేసిన అభ్యర్థులు జిల్లాలోని అమూల్ సంస్థ ద్వారా నిర్వహించే జగనన్న పాలవెల్లువ బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లు, ఆటోమెటిక్ మిల్క్ కలెక్షన్ యూనిట్ల నిర్వహణలో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చు.





తల్లిదండ్రుల ఆశీర్వాదంతో ఎన్నికల ప్రచారానికి

బుచ్చిబాబు శ్రీకారం

- మురమళ్లలో వీరేశ్వరస్వామికి ప్రచార కరపత్రం సమర్పణ
- మద్దతు ప్రకటించిన ఆర్య వైశ్య సంఘ పెద్దలు

ఐ.పోలవరం, మార్చి 5: ముమ్మిడివరం అసెంబ్లీ టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకున్న అనంతరం మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసి ఎన్నికల ప్రచారానికి మంగళవారం శ్రీకారం చుట్టారు. తొలుత వీరేశ్వరస్వామికి ప్రచార కరపత్రాన్ని సమర్పించారు. చైతన్య రథంపై ఆర్య వైశ్య నాయకుడు గోకవరపు వీరేశ్వరరావు ఇంటికి వెళ్లి తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం మురమళ్లలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆ సంఘ నాయకులతో సమావేశమయ్యా రు. ఆర్యవైశ్యులు బుచ్చిబాబుకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, నాయకులు గుత్తుల సాయి, నాగిడి నాగేశ్వరరావు, మందాల గంగసూర్యనారాయణ, గొలకోటి దొరబాబు, టేకుమూడి లక్ష్మణరావు, నడింపల్లి సుబ్బరాజు, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, తాడి నరసింహారావు, చెల్లి అశోక్, పొద్దోకు బాలు, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, సాకా సీతాదేవి, బీర సత్యకుమారి, దాసరి జగదీశ్వరి, ధూళిపూడి బాబి, కట్టా త్రిమూర్తులు, సాగిరాజు సూరిబాబురాజు, దాట్ల పృధ్వీ, కాకర్లపూడి రాజేష్, బొంతు శ్రీరాములు, చెయ్యేటి శ్రీనుబాబు, వీధి లోవరాజు, అర్థాని శ్రీను, గాదిరాజు బుచ్చికృష్ణంరాజు, గంజా సుధాకర్ పాల్గొన్నారు.

నివాసంలో తండ్రి ఆశీర్వాదం తీసుకుంటున్న టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి బుచ్చిబాబు, మురమళ్లలో ప్రచారం చేస్తున్న దృశ్యం

నేడు భీమేశ్వరుని కల్యాణం




సామర్లకోట, మార్చి 5:
కాకినాడ జిల్లా సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభాన్ని పురస్కరించుకుని బుధవారం విఘ్నేశ్వర పూజ, అంకురారోపణ, దీక్షా ధారణలో పూజలు



విద్యుత్ దీపాలంకరణ

ప్రారంభమవుతాయి. మధ్యాహ్నం స్వామి వారు, అమ్మవార్ల దేవతామూర్తులను నంది వాహనంపై అలం కరించి గ్రామోత్సవం నిర్వహిస్తారు. రాత్రి 8.10 గంటలకు ఆలయ ఆవరణలో ఏర్పాటుచేసిన ప్రత్యేక వేదికపై వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి, అమ్మవార్ల దివ్య కల్యాణ మహోత్సవం జరగనుంది. అన్నవరం సత్యదేవుని ఆలయ ప్రధాన అర్చకుల పర్యవేక్షణలో ఘనంగా కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం తెలిపారు.

నేటి నుంచి కల్యాణోత్సవాలు

- పాదగయలో ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు



పిఠాపురం, మార్చి 5: కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో వేంచేసి ఉన్న రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా తొలిరోజు బుధవారం వివిధ ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు కుక్కుటేశ్వర స్వామికి, రాజరాజేశ్వరీ అమ్మవారికి పంచామృత స్నానం, ఉదయం 9 గంటలకు అంకురార్పణం-ధ్వజారోహణం ఉదయం 11 గంటలకు కుక్కుటేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన, రాజరాజేశ్వరి అమ్మవారికి లక్ష కుంకుమార్చన, లక్షపత్రిపూజ నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు స్వామి, అమ్మవార్లకు పెండ్లికుమారుడు, కుమార్తె అలంకారం, సాయంత్రం 5 గంటలకు గజవాహనంపై గ్రామోత్సవం, 6 గంటలకు రామకృష్ణ వాసవి కన్యకా పరమేశ్వరీ కల్యాణ మండపం వద్ద ఎదురుసన్నాహం, రాత్రి 8.32 గంటలకు స్వామి, అమ్మవార్ల దివ్య కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు.

రెండు బైక్‌లు ఢీ

ఇద్దరి మృతి..ఒకరి పరిస్థితి విషమం



గౌతమ్



లక్ష్మణ్

కాట్రేనికోన, మార్చి 5: కాట్రేనికోన మండలం పల్లంకుర్రు పంచాయతీ పరిధిలో వడ్డివారిపేట సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మరణించారు. మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పల్లంకుర్రుకు చెందిన కస్నీడి లక్ష్మణ్ (20), సూర్యతేజ బలుసుతిప్ప నుంచి వస్తూ ఎదురుగా భార్యతో వస్తున్న స్థానిక వైద్యుడు మట్టా సిద్ధార్థగౌతమ్(56) వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో లక్ష్మణ్ అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన గౌతమ్, ఆయన భార్య మణిను స్థానికులు కాట్రేనికోన పీహెచ్‌సీకి తరలించారు. అనంతరం కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సిద్ధార్థగౌతమ్ మంగళవారం మరణించారు. ఆయన భార్య పరిస్థితి కూడా విషమంగానే ఉన్నట్టు, సూర్యతేజ సురక్షితంగానే ఉన్నట్టు తెలిసింది.

ప్రసాద్ స్కీం పనులకు రేపు శంకుస్థాపన

అన్నవరం, మార్చి 5: కేంద్ర ప్రభుత్వ పథకం ప్రసాద్ స్కీం ద్వారా అన్నవరం ఆలయానికి రూ.20 కోట్లు మంజూరవడంతో దీనికి సంబంధించిన పనులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 7న వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించి అన్నవరం దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతోంది. రామాలయ ప్రాంగణంలో సిబ్బంది, గ్రామస్థులు, భక్తులు పనుల ప్రారంభం కార్యక్రమాన్ని తిలకించేలా భారీ స్క్రీన్ ఏర్పాటు చేస్తున్నారు. రూ.20 కోట్లతో టీటీడీ సత్రం వద్ద అన్నదాన నూతన భవనం, క్యూ కాంప్లెక్స్, ప్రకాష్‌సదన్ వెనుక భాగంలో భక్తులకు టాయిలెట్స్, ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు తదితర వాటికి వినియోగించనున్నారు. స్వామివారి వ్రతకథను హిందీలోకి అనువదించాలని ఎప్పటినుంచో ప్రయత్నాలు జరుగుతున్నా నేటికి అమలులోకి రాలేదు. త్వరలో ఈ దిశగా ప్రయత్నాలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

లారీ ఢీకొని యువకుడి మృతి



మృతిచెందిన జేమ్స్‌బాబు

రాజమహేంద్రవరం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొనడంతో ఓ యువకుడు మృతిచెందాడు. ద్రాక్షారామ మండలం ఉంటూరుకు చెందిన డి.జేమ్స్‌బాబు (25) రాజమహేంద్రవరంలోని ఐసీఐసీఐ బ్యాంకులో పని చేస్తుంటాడు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో తన బైక్‌పై విధులకు వస్తున్నాడు. మోరంపూడి జంక్షన్ వద్దకు చేరుకునే సరికి లారీ వేగంగా ఢీకొట్టడంతో కింద పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో ఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచాడు. బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

25 టన్నుల రేషన్‌బియ్యం పట్టివేత



ఆలమూరు: రేషన్ బియ్యాన్ని పట్టుకున్న అధికారులు

అమలాపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి)/ఆలమూరు: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో విజిలెన్స్ రీజనల్ ఎస్పీ కేవీఎస్వీ సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు ఆలమూరులో మంగళవారం తనిఖీలు చేపట్టారు. కల్యాణ చక్రవర్తి వే బ్రిడ్జి సమీపంలో అశోక్ లేలాండ్ లారీని రాజమహేంద్రవరం విజిలెన్స్ సీఐ టి.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో విజిలెన్స్, రెవెన్యూ సివిల్ సప్లయిస్ అధికారులు తనిఖీ చేశారు. 460 తెలుపు రంగు ప్లాస్టిక్ బస్తాలు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌కు చెందిన 40 గోనె సంచులు... మొత్తం 500 బస్తాల్లో సుమారు 25 వేల కిలోల పీడీఎస్ బియ్యం తరలిస్తున్నట్టు గుర్తించారు. కృష్ణా జిల్లా పామర్రుకు చెందిన శ్రీగౌతమి రైస్ అండ్ ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ యజమాని గొట్టిపు రమేష్‌బాబు నుంచి పీడీఎస్ బియ్యాన్ని కాకినాడకు చెందిన వి.శ్రీనివాసరావుకు సరఫరా చేస్తున్నట్టు డ్రైవర్ పెద్దిరెడ్డి రాజేష్ అధికారులకు తెలిపారు. సుమారు రూ.21.37 లక్షల విలువైన పీడీఎస్ బియ్యం, వాహనాన్ని సీజ్ చేసి 6(ఎ) కేసు నమోదు చేసి క్రిమినల్ కేసు కోసం పోలీస్‌స్టేషన్‌కు సిఫార్సు చేసినట్టు అధికారులు తెలిపారు. బియ్యాన్ని ఆలమూరు ఎంఎస్‌వోకు అప్పగించగా మండపేట ప్రభుత్వ గోదాముకు తరలించారు. లారీని ఆలమూరు పోలీసులకు అప్పగించారు. ఆలమూరు ఎస్‌ఐ శ్రీను నాయక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు శ్రీనివాసరెడ్డి, భార్గవమహేష్, అలీషా, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు పాల్గొన్నారు.

20 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

కొవ్వూరు, మార్చి 5: అక్రమంగా తరలిస్తున్న 20 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్టు కొవ్వూరు సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్ జి.బాపిరాజు తెలిపారు. ఉండ్రాజవరం నుంచి కాకినాడ పోర్టుకు లారీలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారని సమాచారం రావడంతో సివిల్ సప్లయిస్ అధికారులు మంగళవారం తెల్లవారుజామున దాడులు చేశారు. కొవ్వూరు ఏషియన్ పెయింట్స్ గొడౌన్ సమీపంలో నేషనల్ హైవేపై లారీని సీజ్‌చేసి, లారీలో ఉన్న 20 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. కాకినాడ జిల్లా కరపకు చెందిన లారీ డ్రైవర్ రాయుడు బాలాజీ, లారీ యజమాని నల్లా శివ, తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం గ్రామానికి చెందిన బియ్యం యజమాని బాషా 6ఎ కేసు నమోదు చేసినట్టు బాపిరాజు చెప్పారు.

ఘనంగా వైద్యనాదేశ్వరస్వామి కల్యాణం

జగ్గంపేట, మార్చి 5: కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాకలో కోటిపార్థివ లింగ మహా రుద్రాభిషేకం దిగ్విజయంగా కొనసాగుతోంది. మంగళవారం విఘ్నేశ్వర పూజ, పరిషత్ పంచగవ్యప్రాసన, గోపూజ, రుద్రాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, లలిత హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జ్యోతుల నెహ్రూ మణి, జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి, తోట సర్వారాయుడు, సునీత దంపతులు పీటలపై కూర్చుని వైద్యనాదేశ్వర స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్థివ లింగం మహారుద్రాభిషేకంలో పాల్గొన్న శ్రీ విజయ రాజరాజేశ్వరి శ్రీ విద్యా పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వాసుదేవానందగిరి స్వాములు, శ్రీ విద్యాపీఠం పెదపులిపాక విజయవాడకు చెందిన పరమహంస పరివ్రజకాచార్య హాజరై మహారుద్రాభిషేకంలో పాల్గొన్నారు. స్పెషల్ పోలీస్ ఎస్పీ కొండ నరసింహారావు , అతివేలు మంగాదేవి దంపతులు శంఖారావంతో భక్తులను ఆకట్టుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డొక్కా సీతమ్మ మనవడు డొక్కా నాథ్‌బాబు, గోకవరం మండలం మాజీ ఎంపీపీ డీవీ సూర్యనారాయణ, కొత్త కొండబాబు, జీను మణిబాబు, అడబాల వెంకటేశ్వరరావు, సుంకవిల్లి రాజు, బదిరెడ్డి అచ్చన్నదొర, దాసరి సీతారామకృష్ణ, అడబాల భాస్కరరావు, మలిరెడ్డి సిరి, వేముల కొండ జోగారావు, యల్లమిల్లి సీఎం, వేలాదిగా భక్తులు పాల్గొని స్వామి వారి దర్శనం చేసుకున్నారు.



హోమంలో పాల్గొన్న జ్యోతుల నెహ్రూ కుటుంబ సభ్యులు

గుంతల రోడ్డుపై ప్రయాణం నరకం

- అధ్వానంగా రాజమండ్రి-భద్రాచలం రహదారి
- నిత్యం ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- కీలకమైన రహదారికి మరమ్మతులు చేయకుండా గాలికొదిలేసిన వైనం

మోతుగూడెం, మార్చి 5: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న తులసిపాక వ్యూ పాయింట్ ఘాటీ నుంచి కనకదుర్గమ్మ ఆలయం వరకు రోడ్లు గుంతలతో అధ్వాన్నంగా ఉన్నాయి. రాజమండ్రి కాకినాడ వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏజెన్సీ పర్యటనకు వచ్చిన వారు ఈ రోడ్డును చూసి భయభ్రాంతులకు గురవుతున్నారు. అసలే ఘాటీ. రోడ్డు గుంతల వల్ల వాహనాలు ఆగిపోతే పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు. ఈ గోతుల్లో పడి వాహనదారులు పలు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో ప్రయాణించాలంటే ప్రాణాలు గుప్పెట్లోనే పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. ఈ మార్గంలో కాకినాడ భద్రాచలం, రాజమండ్రి భద్రాచలం ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ మార్గం గుండా సరిహద్దు రాష్ట్రాలైన తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిసాలోని వివిధ ప్రాంతాలకు పలు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా ఒక్కో సమయంలో వాహనాలు నిలిచిపోతున్నాయి. రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ఈ మార్గంలో మెరుగైన వైద్యం కోసం డొంకరాయి, చింతూరు నుంచి కాకినాడ వెళ్లాలంటే అంబులెన్స్ డ్రైవర్లు హడలిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ రహదారికి మరమ్మతులు చేయాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న రోడ్డు

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళం అందిస్తున్న దాతలు

అయినవిల్లి, మార్చి 5: పి.గన్నవరం మండలం వాడ్రేవుపల్లికి చెందిన పట్నాల దత్తాత్రేయ దంపతులు మంగళవారం అయినవిల్లి శ్రీ విఘ్నేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నిత్యాన్నదాన పథకానికి రూ.1,11,116 విరాళాన్ని చెక్కు రూపంలో ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబుకు అందజేశారు. దాతలకు అర్చకులు వేద ఆశీర్వచనం అందించి శేష వస్త్రంతో సత్కరించగా చైర్మన్ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేసి అభినందించారు.

చోరీలకు పాల్పడుతున్నారని..

పిఠాపురంలో ముగ్గురికి దేహశుద్ధి

పిఠాపురం, మార్చి 5: చోరీలకు పాల్పడుతూ స్థానికుల చేతికి చిక్కారు ముగ్గురు వ్యక్తులు. కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని కుంతీమాధవస్వామి దేవస్థానంలో పనిచేసే దుర్గ అనే మహిళ ఇంట్లోకి ముగ్గురు వ్యక్తులు ప్రవేశించి దొంగతనానికి ప్రయత్నించారు. ఇది గమనించిన స్థానికులు వారిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. పోలీసులు వారిని విచారిస్తున్నారు. వీరు పట్టణానికి చెందిన వ్యక్తులా లేక ఇతర ప్రాంతాలకు చెందిన వారా అని ఆరా తీస్తున్నారు.

షోరూంలో అగ్నిప్రమాదం



అమలాపురం టౌన్, మార్చి 5: అమలాపురం కళాశాల రోడ్డులోని గోఖలే సెంటర్లో వాసంశెట్టి మణిశంకర్‌కు చెందిన బెలూన్స్ అన్ లిమిటెడ్ షోరూంలో మంగళవారం సాయంత్రం అగ్ని ప్రమాదం సంభవించింది. అమలాపురం అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. బెలూన్స్ డెకరేషన్ షోరూంతో పాటు గిఫ్ట్ షోరూం కూడా అగ్నికి ఆహుతయ్యింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ప్రమాదంలో రూ.8 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని అగ్నిమాపక అధికారి కేవీ మురళీ కొండబాబు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

సామర్లకోట, మార్చి 5: కాకినాడ జిల్లా సామర్లకోట తహశీల్దార్ కార్యాలయం సమీపాన రాజీవ్ గృహ కల్ప సముదాయాల వద్ద ఒక ప్లాట్‌లో సుమారు 40 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉండడాన్ని మంగళవారం సాయంత్రం స్థానికులు గుర్తించి సామర్లకోట పోలీసులకు సమాచారం అందించారు. ఇంటి తలుపులు మూసి ఉన్న ప్లాట్ నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని తలుపులు తెరిచి దర్యాప్తు ప్రారంభించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని సామర్లకోట పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాల నేపథ్యంలో ఘర్షణ

భార్య చెంపపై కొట్టిన భర్త..అక్కడికక్కడే మృతిచెందిన మహిళ



మృతిచెందిన సాయిదీపిక

కొవ్వూరు, మార్చి 5: ఘర్షణ పడే క్రమంలో భర్త.. భార్య చెంపపై గట్టిగా కొట్టడంతో మృతిచెందింది. కొవ్వూరు మండలం మద్దూరులో ఈ ఘటన జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మద్దూరుకు చెందిన సంద్ర వీరబాబుకు, అత్తిలి గ్రామానికి చెందిన లావణ్య సాయిదీపికతో 2010లో వివాహం జరిగింది. వీరికి కుమారుడు జయశంకర్, కుమార్తె కుందన ఉన్నారు. వీరబాబు తాపీ పనిచేస్తుంటాడు. మద్యం, పేకాట, కోడి పందాలకు బానిస కావడంతో భార్యాభర్తల మధ్య తరచూ డబ్బు విషయమై గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం డ్వాక్రా రుణానికి సంబంధించిన వాయిదా డబ్బు చెల్లింపు విషయంలో ఇద్దరు ఘర్షణ పడ్డారు. ఈ కొట్లాటలో కోపంతో వీరబాబు భార్య చెంపపై గట్టిగా కొట్టాడు. దీంతో మాటలేకుండా లావణ్య కిందపడి మరణించింది. జరిగిన సంఘటనను వీరబాబు అత్తిలిలో ఉన్న అత్తమామలకు ఫోనులో తెలియజేయగా వారు హుటాహుటిన మద్దూరు రావడంతో లావణ్య చనిపోయిన విషయం బయటకు వచ్చింది. కొవ్వూరు డీఎస్పీ కె.రామారావు, సీఐ పి.శ్రీనివాసరావు, రూరల్ ఎస్‌ఐ కె.సుధాకర్ సంఘటనా స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులు, బంధువుల నుంచి వివరాలు సేకరించారు. లావణ్య తల్లిదండ్రులు బడేటి గణపతి, వెంకటలక్ష్మి మాట్లాడుతూ వివాహం జరిగినప్పటి నుంచి తమ కుమార్తెను సరిగా చూసుకోలేదని, భర్తతోపాటు అత్త సంద్ర సూర్యకుమారి బాధలు పెడుతూనే ఉన్నారని, అన్యాయంగా తమ కుమార్తెను చంపేశారని ఆరోపించారు. తండ్రి ఫిర్యాదు మేరకు భర్త, అత్తపై హత్య కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

భర్తపై కోపంతో ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నం

రక్షించి కౌన్సిలింగ్ ఇచ్చిన పోలీసులు

సామర్లకోట, మార్చి 5: కుటుంబ కలహాలు, భర్తపై కోపంతో కాకినాడ జిల్లా సామర్లకోటలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకునే ప్రయత్నం చేసిన ఒక మహిళను సామర్లకోట రైల్వే పోలీసులు రక్షించారు. సామర్లకోట మండలం వీకె రాయపురం గ్రామానికి చెందిన మల్లిరెడ్డి నాగలక్ష్మి భర్త మద్యానికి బానిసై పలువురి వద్ద అప్పులు చేస్తూ జల్సాలు చేయడంతో జీవితంపై విరక్తి చెందింది. దీంతో ఆత్మహత్య చేసుకునేందుకు సామర్లకోట రైల్వే స్టేషన్‌కు తన కుమార్తెతో సహా చేరుకుని పట్టాల వద్ద ఉండడాన్ని గమనించిన పల్స్ పోలియో సిబ్బంది సామర్లకోట రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రైల్వే పోలీసులు హుటాహుటిన స్పందించారు. సంఘటనా స్థలానికి చేరుకుని నాగలక్ష్మిని, ఆమె కుమార్తెను రక్షించారు. సమాచారం తెలుసుకుని భర్త శివదుర్గను స్టేషన్‌కు రప్పించి భార్యాభర్తలిద్దరికీ పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం వారిని స్వగ్రామం అయిన వీకే రాయపురం పంపించారు.



భార్యాభర్తలకు కౌన్సిలింగ్ ఇచ్చిన పోలీసులు

అనుమానాస్పద స్థితిలో ఒడిసా యువకుడి మృతి

అమలాపురం రూరల్, మార్చి 5: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ తాండవపల్లి రొయ్యల చెరువుల వద్ద పనిచేసేందుకు వచ్చిన ఒడిసా యువకుడు సంజయ్ కాటా (23) మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఒడిసాకు చెందిన నలుగురు యువకులు గత నెల 29న తాండవపల్లిలో రొయ్యల చెరువుల వద్ద పనిచేసేందుకు వచ్చారు. వారిలో సంజయ్ కాటా స్థానిక రైతు చొప్పల వీవీ నాగేశ్వరరావు వద్ద పనికి కుదిరాడు. ఈ నెల ఒకటో తేదీన మిత్రులతో కలిసి భోజనం చేస్తూ ఇక్కడ పనిచేయలేనని, ఉండలేకపోతున్నానని ఇంటికి వెళ్లిపోతానని చెప్పాడు. భోజనం చేసిన కొన్ని గంటల తర్వాత నుంచి సంజయ్ కనిపించలేదు. 2వ తేదీన చెరువుల యజమాని ఒడిసాలోని కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి మీ అబ్బాయి ఇంటికి వచ్చారా అని ఆరా తీశారు. బిడ్డ ఇంటికి రాకపోవడంతో కంగారుపడ్డ కుటుంబ సభ్యులు తాండవపల్లి చేరుకుని ఆచూకీ కోసం వెతకడం ప్రారంభించారు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో చెరువు గట్టు పక్కన సంజయ్ మృతదేహం ఉన్నట్టు స్థానికులు గుర్తించారు. తాలూకా ఎస్‌ఐ కె.శేఖర్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. సంజయ్ సోదరుడు అర్జున్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

వేర్వేరు రైలు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తుల మృతి

తుని రూరల్, మార్చి 5: కాకినాడ జిల్లా తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు చోట్ల జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. తుని రైల్వేస్టేషన్‌కు దగ్గరలో లింగాలకాలనీ వద్ద రైలు పట్టాలపై మృతదేహం లభ్యమైందని, వివరాలు తెలియరాలేదని ఎస్‌ఐ తెలిపారు. అదే విధంగా తిమ్మాపురం రైల్వేస్టేషన్ సమీపంలో బెంగళూరు నుంచి జార్ఖండ్ వెళుతున్న గుర్తు తెలియని ప్రయాణికుడు రైలు నుంచి జారి పడటంతో తీవ్ర గాయాలపాలయ్యాడన్నారు. 108 సహాయంతో ఏరియా ఆసుపత్రికి తరలించివైద్యం అందించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రెండు ఘటనపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రిలో భద్రపరిచి బంధువులకు సమాచారం ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించాలి

రంపచోడవరం, మార్చి 5: మహా శివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సబ్ కలెక్టరు కార్యా లయంలో ఆయన ఏఎస్పీ జగదీష్ అడహళ్లితో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టరు మాట్లాడుతూ ఐదు రోజుల ఉత్సవాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలన్నారు. ఏఎస్పీ మాట్లాడుతూ శివాలయాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వివిధ శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది, కమిటీ సభ్యులు అందుబాటులో ఉండి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో ప్రకాశం, డీఎల్‌పీవో రాఘవన్, ఎంపీడీవో హరికృష్ణ, తహశీల్దార్లు సత్య నారాయణ, చలపతిరావు, డీటీ బి.రాజు, సీఐ వి.వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ మోహన్‌రావు, ఆర్టీసీ డీఎం రమణ పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, ఏఎస్పీ

ఏర్పాట్లపై ఏఎస్పీ ఆరా

చింతూరు, మార్చి 5: మహా శివరాత్రి వేడుకల నిర్వహణపై చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా మంగళవారం సమీక్ష నిర్వహించారు. వీరాపురం శివలింగం వద్దకు ప్రతి ఏటా ఛత్తీస్‌గఢ్, ఒడిసా, తెలంగాణ నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. దీంతో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని శివరాత్రి వేడుకల నిర్వహణ కమిటీకి సూచించారు. కార్యక్రమంలో సీఐ గజేంద్రకుమార్, ఎస్‌ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ముమ్మిడివరం, మార్చి 5: ఇంటర్మీడియ్ రెండో సంవత్సరం ఇంగ్లీషు పేపరు-2 పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. డాక్టర్ మోకా గణపతిరావు డిగ్రీ కళాశాలలో 277 మందికి 259 మంది, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 234 మందికి 224 మంది, తారా కళాశాలలో 184 మందికి 174 మంది హాజరయ్యారు. మొత్తం 695 మందికి 657 మంది పరీక్షకు హాజరైనట్టు కస్టోడియర్ డి.విజయకుమార్ తెలిపారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాం

● ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధుసూదన్

ముమ్మిడివరం, మార్చి 5: ఎన్నికలు సజావుగా, సక్రమంగా నిర్వహించేందుకు అవసరమైన అన్నిచర్యలు తీసుకున్నట్టు ముమ్మిడివరం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కోనేరు రంగారావు కమిటీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.మధుసూదన్ పేర్కొన్నారు. ముమ్మిడివరం తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులతో ఎన్నికల నిర్వహణకు సంబంధించి సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం స్థానిక విలేఖరులతో మాట్లాడారు. నియోజకవర్గంలోని 268 పోలింగ్ కేంద్రాలను పరిశీలించామన్నారు. వీటిలో గోదావరి, సముద్ర పరీవాహక ప్రాంతాల్లో గోగుల్లంక, మగసానితిప్ప, హోప్ ఐలాండ్ గ్రామాలను పరిశీలించా మన్నారు. ఆయా గ్రామాల్లో పోలింగ్ సక్రమంగా, సజావుగా నిర్వహించేందుకు సంబంధించిన అన్నిఏర్పాట్లు చేసినట్ల చెప్పారు. ఈవీఎంలను ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన ఈవీఎంలను, ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తరువాత ముమ్మిడివరం నియోజకవర్గానికి సంబంధించి ముమ్మిడివరం ఎంజీఆర్ కలాశాల డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు తరలించామన్నారు. ఇప్పటికే ఓటింగ్‌పై నియోజకవర్గంలో ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. నామినేషన్ ప్రక్రియ పూర్తయిన తరువాత బ్యాలెట్ పేపరు ప్రింట్లు చేయించి ఈవీఎంలో నిక్షిప్తం చేస్తామన్నారు. అనంతరం వివిధ రాజకీయపార్టీల సమక్షంలో పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 27 ఈవీఎంలతో మాక్ పోలింగ్ నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గంలో 268 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఓటింగ్ ప్రక్రియకు సంబంధించి ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రకారం 120శాతం ఈవీఎంలు, 130శాతం వీవీ ప్యాట్లు ఉంచామన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో ఆరుగురు పోలింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తారని, వీరిలో ఒకరు సచివాలయ ఉద్యోగి ఉంటారన్నారు. పీవో ఒకరు, ఏపీవో ఒకరు, ఓపీవో నలుగురు ఉంటారన్నారు. ఓట్ల నమోదు నామినేషన్ ప్రక్రియకు పదిరోజుల ముందువరకు యాప్‌లో ఓట్లు నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించి సువిధ ఎన్నికల సందర్భంగా అక్రమాలకు సంబంధించి సీవీజిల్ వంటి యాప్‌లను ఎన్నికల సంఘం అందుబాటులో ఉంచిందన్నారు. వీటి సేవలను వారు వినియోగించవచ్చన్నారు. వ్యయాలు, ఫిర్యాదులకు సంబంధించి వివిధ యాప్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. సమావేశంలో ఏఆర్వో వి.శ్రీనునాయక్ ఉన్నారు.

‘తప్పుడు ప్రచారాలు చేస్తే సహించేది లేదు’

మామిడికుదురు, మార్చి 5: తమపై తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదని అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం కల్యాణకట్ట నాయీ బ్రాహ్మణ సేవా సంఘ సభ్యులు పేర్కొన్నారు. జీవో నెం.110 అమలుకు వ్యయప్రయాసలకోర్చి పోరాటాలు చేసి సమ్మె చేశామ న్నారు. దేవస్థానంలో 46 మందికి 9 మంది 65 సంవత్సరాలు వయసు పైబడిన వారిని తగ్గించి మిగిలిన 37 మందికి జీవో అమలు చేయాలని పోరాటం చేశామన్నారు. దేవస్థానానికి ఆదాయం ఎంతో లేదని ఉన్నతాధికారులు, పాలకమండలి ఎమ్మెల్యే సమక్షంలో విధులకు సరిగా హాజరు కాని 13 మందిని తొలగించారన్నారు. వారిలో పసలపూడి తాతారావు ఆధ్వర్యంలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు సొమ్ములు ఇచ్చామని ప్రెస్‌మీట్లు పెట్టి చేసిన తప్పుడు ఆరోపణలను వారు ఖండించారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ఆర్ఎస్‌వీఎస్ ప్రసాద్, కార్యదర్శి పి.దుర్గారావు, ఐ.సతీష్‌కుమార్, కాజులూరి రాజేష్, ఆర్వీ రమణమూర్తి, గూడపల్లి రాజారమేష్, రామేశ్వరపు శ్రీనివాసరావు, కేఎస్ఎన్ మూర్తి, కాట్రపర్తి దుర్గాప్రసాద్, కార్మికుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలే శ్రీరామరక్ష

ఆత్రేయపురం, మార్చి 5: టీడీపీ-జనసేన రూపొందించిన సూపర్ సిక్స్ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు శ్రీరామరక్షగా నిలుస్తాయని టీఎన్టీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ముళ్ళపూడి భాస్కరరావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన పేరవరంలో ఇంటింటికీ వెళ్లి జాబ్ క్యాలెండర్లు అందజేశారు. ఆత్రేయపురంలో టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, ర్యాలిలో మాజీ సర్పంచ్ పేరిచర్ల పుల్లంరాజువర్మ, గ్రామ శాఖ అధ్యక్షుడు మెర్ల నాగేశ్వరరావు, బొబ్బర్లంకలో మాజీ సర్పంచ్ జల్లి కామేశ్వరరావు, గ్రామశాఖల అధ్యక్షులు, ముఖ్య నాయకులు ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టోలోని అంశాలను వివరించారు.

టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా ‘ధర్నాల’

కొత్తపేట, మార్చి 5: టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా కొత్తపేటకు చెందిన మాజీ జడ్పీటీసీ ధర్నాల రామకృష్ణను నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు నియామక ఉత్తర్వులు జారీచేశారు. రామకృష్ణ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి, కొత్తపేట నియోజకవర్గ అభ్యర్థి బండారు సత్యానందరావు విజయానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

టీడీపీ రాష్ట్ర అదనపు వాణిజ్య విభాగం కార్యదర్శి యాళ్ల

ముమ్మిడివరం, మార్చి 5: టీడీపీ రాష్ట్ర అదనపు వాణిజ్య విభాగం కార్యదర్శిగా ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లి ఉప సర్పంచ్ యాళ్ల సూర్యప్రకాష్(ఉదయ్)ను నియమించారు. ముమ్మిడివరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాట్ల బుచ్చిబాబు మంగళవారం ఈ ఉత్తర్వులను వెల్లడించారు. నూతనంగా నియమితులైన యాళ్ల ఉదయ్‌ను మాజీ ఎమ్మెల్యేలు దాట్ల బుచ్చిబాబు, చెల్లి వివేకానంద అభినందించారు.

‘అంకితభావంతో పనిచేసే వారికి గుర్తింపు’

ఉప్పలగుప్తం, మార్చి5: టీడీపీలో అంకితభావంతో పనిచేసే ప్రతిఒక్కరికీ గుర్తింపు ఉంటుందని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. భీమనపల్లిలో మంగళవారం జరిగిన పార్టీసమావేశంలో నియోజకవర్గం నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా నియమితులైన మాజీ జడ్పీటీసీ వెంకటలక్ష్మీనారాయణను అభినందించారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్సీ తోట

మండపేట, మార్చి 5: అభివృద్ధి, సంక్షేమమే వైసీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని ద్వారపూడిలో మంగళవారం జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు.

చేనేత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: హరీష్‌మాధుర్

మలికిపురం, మార్చి 5: టీడీపీ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో వచ్చే ఎన్నికల్లో విజయాన్ని సాధిస్తామని అమలాపురం పార్లమెంటరీ టీడీపీ ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్ అన్నారు. మంగళవారం మోరిలో రాష్ట్ర చేనేత నాయకుడు చింతా వీరభద్రేశ్వరరావును హరీష్‌మాధుర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ లోకేశ్‌కు, తెలుగుదేశం పార్టీకి చేనేత సమస్యలపై ఒక అవగాహన ఉందన్నారు. కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైన్ పూర్తి చేయడానికి పార్టీ పెద్దలతో కలిసి ముందుకు వెళతానన్నారు. మాజీ ఎంపీపీ పప్పుల లక్ష్మీసరస్వతీ రమేష్, మండల టీడీపీ అధ్యక్షుడు ముప్పర్తి నాని, జక్కంపూడి ఆదినారాయణ, పిండి వెంకటమోహనరావు, కటకం ధనలక్ష్మీశ్వరరావు, చింతా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిబాబుకు సత్కారం

ఐ.పోలవరం, మార్చి 5: ముమ్మిడివరం నియోజకవర్గం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు దంపతులను ఘనంగా సన్మానించారు. భారీ మెజార్టీతో గెలిపిస్తామని ఆర్యవైశ్యులు బుచ్చిబాబుకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు కొప్పరావారి మల్లిబాబు, గోకవరపు వెంకటరమణమూర్తి, కంచర్ల లక్ష్మణరావు, కంచర్ల సురేష్, గోకవరపు పెదబాబు, గోకవరపు శ్రీను, గోకవరపు వీరేష్, గమిని మల్లిబాబు పాల్గొన్నారు.

శివారు ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట

రావులపాలెం, మార్చి 5: టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామాల్లోని శివారు ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానని కొత్తపేట నియోజకవర్గ అభ్యర్థి బండారు సత్యానందరావు అన్నారు. వెదిరేశ్వరం శివారు మూలగూడెం, రాళ్ళగండి, బొక్కావారిపాలెంల్లో మంగళవారం రాత్రి ‘బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ’ కార్యక్రమం నిర్వహించారు.

జయహో బీసీకి తరలివెళ్లిన టీడీపీ నాయకులు

రాజోలు, మార్చి 5: గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట జరుగుతున్న జయహో బీసీ సభకు రాజోలు నియోజకవర్గం నుంచి టీడీపీ నేతలు, కార్యకర్తలు శివకోటి మీదుగా మంగళవారం తరలివెళ్లారు. జయహో బీసీ అంటూ నినాదాలుచేస్తూ వారు బయలుదేరారు. టీడీపీ బీసీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్, బోళ్ల వెంకటరమణ, మానుకొండ దుర్గాప్రసాద్, పెచ్చెట్టి జగదీష్, కట్టా సూరిబాబు తదితరులు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

సాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు: ఇరిగేషన్ ఎస్ఈ

కొత్తపేట, మార్చి 5: అవిడి ఆయకట్టు పరిధిలోని వరి రైతులకు సాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ సూపరింటెండెంట్ జి.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన తహసీల్దారు జి.ఎలీషాతో కలిసి అవిడి ఆయకట్టును రైతుల సమక్షంలో పరిశీలించారు. వంతుల వారీ విధానంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సాగునీరు లేక వరి చేలు బీటలు తీశాయన్నారు. ప్రస్తుతం చేలు పొట్ట దశలో ఉన్నాయని, ఈ సమయంలో సాగునీరు అందకపోతే పంట దిగుబడి తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లగా ఆయన అధికారులకు చెప్పారన్నారు. ఇందుకు స్పందించిన ఎస్ఈ అవిడి ఆయకట్టు రైతులకు మరో రెండు రోజులు అదనంగా సాగునీరు అందిస్తామని, ఎవ్వరూ ఆందోళన చెందవద్దని చెప్పారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ముమ్మిడివరం, మార్చి 5: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ముమ్మిడివరంలోని డ్వామా కార్యాలయంలో పీడీ ఎస్.మధుసూదన్‌కు వినతిపత్రం అందించారు. ఏపీ గ్రామీణాభివృద్ధి ఉద్యోగుల అసోసియేషన్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా ఆధ్వర్యంలో ఉద్యోగులంతా జిల్లా పీడీ కార్యాలయంలోని పీడీని కలిసి వినతిపత్రం అందించారు. జిల్లాలోని ఉపాధి హామీ పథకంలో పనిచేసే ఉద్యోగులంతా బడుగు, బలహీనవర్గాలకు చెందిన వారమేనని, 42శాతం బీసీ, 26శాతం ఎస్సీ, ఎస్టీ 7శాతం, మొత్తం75 శాతం, ఓసీ 25శాతం. వీరిలో అత్యధికులు బడుగు బలహీన వర్గాలకు చెందిన వారే, షెడ్యూల్డుకులాలు, తెగలకు చెందిన వారని పేర్కొన్నారు.

అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లండి

● రీజనల్ కో-ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి

పి.గన్నవరం, మార్చి5: రాష్ట్రానికి చంద్రబాబు సీఎం అయితే సచివాలయం, వలంటీర్ల వ్యవస్థలు, ఐదేళ్లుగా జరుగుతున్న అభివృద్ధి పోతుందని ప్రజల్లోకి తీసుకువెళ్లండి, అలాగే జగన్ సీఎం కాకపోతే జరిగే నష్టాన్ని ప్రజలకు వివరించండి అంటూ ఉభయగోదావరిజిల్లాల వైసీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ పీవీ మిథున్‌రెడ్డి పి.గన్నవరం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలను కోరారు. చాకలిపాలెం శ్రీకృష్ణ ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గ ఇన్‌చార్జ్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమీక్షాసమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కష్టపడిన వారికి పదవులు ఉంటాయన్నారు. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు గైర్హాజర్‌పై స్పందించిన ఆయన చిట్టిబాబు అంటే సీఎం జగన్‌కు మంచి గుర్తింపు, గౌరవం ఉందని రెండుసార్లు అవకాశం ఇచ్చారు కాబట్టి ఈసారి మార్చారని ఆయన తెలిపారు. మంత్రి విశ్వరూప్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎంపీ సీహెచ్ అనురాధ, ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్‌లు మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రంలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. అలాగే రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు మాట్లాడుతూ అదిష్ఠానం ఎంపీగా పోటీచేయాలని సూచిస్తుందని జగన్ నిర్ణయమే శిరోధార్యమని చెబుతూ.. ఎంపీగా పంపిస్తే మీరు కూడా సహకరించాలని కోరారు. ఇదంతా సిట్టింగ్ ఎంపీ అనురాధ ఎదుటే రాపాక మాట్లాడటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ మాట్లాడు తూ పి.గన్నవరం టీడీపీ సీటు విషయంలో మహాసేన రాజేష్ సీఎం జగన్‌పై చేస్తున్న ఆరోప ణలు అవాస్తవమని తప్పుపట్టారు. అనంతరం జిల్లా వాణిజ్యవిభాగం అధ్యక్షుడు మంతెన రవిరాజు ఆధ్వర్యంలో మిథున్ రెడ్డిని సత్కరించారు. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, పీకేరావు, జక్కంపూడి కిరణ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.88.34లక్షలతో నిర్మించిన ప్రభుత్వ భవనాలు ప్రారంభం

అమలాపురం రూరల్, మార్చి 5: మాజీ మంత్రి కుడుపూడి ప్రభాకరరావు కుటుంబ సభ్యులు పేరూరులో దానం చేసిన స్థలంలో రూ.88.38 లక్షల అంచనా వ్యయంతో గ్రామసచివాలయం, ఆర్బీకే, హెల్త్ క్లినిక్ భవనాలు నిర్మించారు. మంగళవారం వాటిని వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి ఆయన ప్రారంభించారు. మంత్రి పినిపే విశ్వరూప్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దాతలైన ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి-బాబు దంపతులను పలువురు అభినందించారు. ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్యేలు చిర్ల జగ్గిరెడ్డి, రాపాక వరప్రసాదరావు, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణ రావు, బొమ్మి ఇజ్రాయిల్, ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, బొంతు గోవిందుశెట్టి, జడ్పీటీసీ పందిరి శ్రీహరి, పినిపే శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే చిట్టబ్బాయి కాంస్య విగ్రహం ఆవిష్కరణ

అమలాపురం టౌన్, మార్చి 5: అమలాపురం గడియార స్తంభం సెంటరు సమీపంలో ఏర్పాటుచేసిన మాజీ ఎమ్మెల్యే కుడుపూడి చిట్టబ్బాయి కాంస్య విగ్రహాన్ని ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీ మార్గాని భరత్, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు నివాళులర్పించారు. అతిథులకు రాష్ట్ర దృశ్యకళల అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్యశైలజ-భరత్‌భూషణ్ కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా విక్రమ భట్టీశ్వరస్వామి కల్యాణం

ఆలమూరు, మార్చి 5: పురాణ ప్రసిద్ధి గాంచిన ఆలమూరులో పార్వతీ సమేత విక్రమ భట్టీశ్వరస్వామి కల్యాణం మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది. తొలుత స్వామివారిని పెండ్లి కుమారుడిగా అలంకరించి నంది వాహనంపై సన్నాయిమేళాలు, డప్పు వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగించారు. ఆలయ ప్రధానార్చకుడు కాళ్లకూరి సూరిపండు ఆధ్వర్యంలో వేద పండితులు కల్యాణాన్ని జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఎన్నికల బందోబస్తుకు మాజీ సైనికులకు ఆహ్వానం

అమలాపురం టౌన్, మార్చి 5: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల బందోబస్తులో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లాలోని మాజీ సైనికులను జిల్లా సైనిక సంక్షేమాధికారి మజ్జి కృష్ణారావు ఆహ్వానించారు. ఆసక్తి గలవారు ఆయా జిల్లాల్లోని దగ్గర పోలీసు స్టేషన్లలో పూర్తి వివరాలు తెలియజేసి తక్షణం పేర్లు నమోదు చేయించుకోవాలని జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయం ఒక ప్రకటనలో కోరింది.

సామాజిక తనిఖీ

మామిడికుదురు, మార్చి 5: భవన నిర్మాణ కార్మికులకు కార్మికశాఖద్వారా మంజూరైన నిధుల వినియోగానికి సంబంధించి సామాజిక తనిఖీని కార్మికశాఖ సహాయ కమిషనరు జి.కేశవరావు మంగళవారం నిర్వహించారు. 2018- 19, 2019-20ల్లో పెళ్లి కానుక, ప్రమాదబీమా వాటికి కార్మికశాఖ ఇచ్చిన రూ.10.80లక్షలకు వివరాలను సేకరించారు.

10న ప్రవేశ పరీక్షలు

అల్లవరం, మార్చి 5: మండలంలోని గోడిసాంఘిక సంక్షేమశాఖ బాలుర గురుకుల పాఠశాలలో 5వ తరగతికి, కళాశాలలో ఇంటర్మీడియట్‌కు ప్రవేశ పరీక్ష ఈనెల 10న జరుగుతుందని ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్ తెలిపారు.

పీసీసీ అధికార ప్రతినిధిగా సురేష్‌బాబు

ఉప్పలగుప్తం, మార్చి 5: ఉప్పలగుప్తం మండలం సరిపల్లికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గెడ్డం సురేష్‌బాబు పీసీసీ అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిళ నుంచి తనకు ఉత్తర్వులందినట్టు సురేష్‌బాబు తెలిపారు.

పుదుచ్చేరి క్యాబినెట్‌లో నూతన మంత్రి

యానాం, మార్చి 5: పుదుచ్చేరిలోని ఎన్‌డీఏ కూటమికి చెందిన ఎన్‌ఆర్‌కాంగ్రెస్ ప్రభుత్వంలో నూతన మంత్రిగా కారైకాల్‌కు చెందిన తిరుమురుగన్‌కు స్థానం లభించింది. ఎన్ఆర్ కాంగ్రెస్‌పార్టీకి చెందిన తిరుమురుగన్ కారైకాల్ నార్త్ నుంచి ఎన్నికయ్యారు.